సాక్షి
వికారాబాద్
ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024



గాలి వాన బీభత్సం

ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో చెట్లు నేలకొరగాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. 8లో▸



మొదలైన సాగు కష్టాలు

ఎండ తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది. దీంతో వ్యవసాయ బోర్లలో నీటి మట్టం తగ్గి పంటలు ఎండిపోతున్నాయి. 9లో▸



ప్రారంభానికి సిద్ధం

కొడంగల్ పట్టణంలో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన పలు భవనాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. 9లో▸

న్యూస్‌రీల్

23న కొడంగల్‌కు సీఎం రేవంత్ రాక

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 23న కొడంగల్ నియోజకవర్గానికి వస్తున్నారు. మద్దూరు మండల కేంద్రంలో మధ్యాహ్నం 12 గంటలకు గ్రీన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం తిమ్మారెడ్డిపల్లి బావోజీ శ్రీ గురు లోకమసంద్ ప్రభు జాతరలో పాల్గొని పూజలు నిర్వహిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మిట్టా



పరమేశ్వర్ రెడ్డి

పరిగి: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పూడూరు మండలం చీలాపూర్‌కు చెందిన మిట్ట పరమేశ్వర్ రెడ్డిని నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమిందర్ రెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మిట్టా మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి రాష్ట్ర కార్యవర్గంలో అవకాశం కల్పించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా అశోక్



నియామక పత్రం అందుకుంటున్న అశోక్

బంట్వారం: బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా కోట్‌పల్లి మండలం ఇందోల్ గ్రామానికి చెందిన అశోక్ నియమితులయ్యారు. శనివారం వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు. చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజు, కృష్ణ, పాండు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మే ఒకటి నుంచి వేసవి ఉచిత శిక్షణ శిబిరాలు

అనంతగిరి: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మే ఒకటి నుంచి 31వ తేదీ వరకు 14 ఏళ్ల లోపు బాల, బాలికలకు వేసవి ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల, యువజన సర్వీసుల శాఖ అధికారి హనుమంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ గ్రామీణ ప్రాంతంలో ఈ క్రీడలను నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ నేషనల్ క్రీడాకారులు, ఇతర సీనియర్ శిక్షకులు వారి ధ్రువ పత్రాలు, శిక్షణ ఇచ్చే క్రీడల వివరాలు, ప్రదేశం, గ్రామం వివరాలను ఈ నెల 25వ తేదీలోపు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ కార్యాలయం, కలెక్టరేట్ కాంప్లెక్స్ ఎస్ 15 గది నందు స్వయంగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. క్రీడలు నిర్వహించే వారికి గౌరవ వేతనం రూ.4వేలు, క్రీడా సామగ్రి అందజేయనున్నట్లు తెలిపారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 96766 38201లో సంప్రదించాలని సూచించారు.

పల్లెలకు బీఆర్ఎస్ ప్రచార రథాలు

పూజలు చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలోని గ్రామాల్లో పర్యటించేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రచార వాహనాలను సిద్ధం చేసి వాటికి పూజలు చేశారు. మండలంలోని కుమ్మెర బస్‌స్టేజీ వద్ద ఉన్న బంగారు మైసమ్మ దేవాలయం వద్ద శనివారం ప్రచార వాహనాలకు పూజలు చేసి వాటిని గ్రామాల్లో ప్రచారాలకు పంపించారు. రావులపల్లిలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య ముందుగా చేవెళ్ల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు ఒకసారి మార్పు కోరుకొని కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని.. ఇచ్చిన అధికారాన్ని ఆ పార్టీ నిలబెట్టుకోలేకపోతోందని అన్నారు. ప్రజలు ఇప్పుడు ఎందుకు బీఆర్ఎస్‌ను పోగొట్టుకున్నామా అని బాధపడుతున్నారన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

పూత దశలో కంది పంట



ఆహా ఏమి రుచి

వింటే భారతం వినాలి.. తింటే తాండూరు కంది పప్పే తినాలి ఇదీ నేటి మాట. రుచితోపాటు అధిక ప్రొటీన్లు ఉండటంతో భౌగోళిక గుర్తింపు పొందింది. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో అగ్రస్థానంలో నిలిచింది. రైతులకు ఆర్థిక ప్రయోజనాన్ని చేకూరుస్తోంది.. కూలీలతోపాటు మార్కెటింగ్ విభాగంలో వేలాది మందికి ఉపాధి కల్పిస్తోంది.. భోజన ప్రియులు.. ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి అనేలా చేస్తోంది..



తాండూరు కంది పప్పనకు భలే క్రేజ్

- నాణ్యతలో మేటి.. రుచిలో లేదు సాటి
- భౌగోళిక గుర్తింపుతో పెరిగిన డిమాండ్
- ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి
- 24 శాతం ప్రొటీన్లు
- మిగిలిన పప్పులతో పోలిస్తే ఇందులో మూడింతల అధికం

కొడంగల్: తాండూరు కంది పప్పుకు ఓ ప్రత్యేకత ఉంది. చూడడానికి పెద్ద సైజులో ఉంటుంది. రుచిలో మరే ఇతర పప్పు దీనికి సాటి రాదు. తాండూరు, కొడంగల్ ప్రాంతాల్లోని నల్లరేగడి భూముల్లో పండించిన కంది పప్పుకు ప్రపంచ మార్కెట్‌లో మంచి ఆదరణ ఉంది. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో పండించిన కంది పప్పు కంటే తాండూరు కంది పప్పు త్వరగా ఉడుకుతుంది. తొందరగా పాడవదు. దేశంలోని పలు రాష్ట్రాల్లో తాండూరు కంది పప్పు అనే బ్రాండ్‌తో విక్రయిస్తున్నారంటే దీనికి ఎంతటి డిమాండ్ ఉందో తెలుస్తోంది. ప్రతి ఏటా తాండూరు, కొడంగల్ వ్యవసాయ మార్కెట్లలో కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంది.



జిల్లా రైతులకు గర్వకారణం

ఇక్కడి కంది పప్పు ప్రపంచ స్థాయిలో ఖ్యాతి పొందింది. భౌగోళిక గుర్తింపు (ఈ ప్రాంతానికి మాత్రమే చెందినదని.. ఇక్కడ మాత్రమే పండుతుందని..) లభించింది. ఇది వికారాబాద్ జిల్లా రైతులకు గర్వకారణంగా చెప్పవచ్చు. జిల్లాలోని తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో మాత్రమే ఎక్కువగా పండుతుంది. తాండూరు కందిలో 24 శాతం ప్రొటీన్లు ఉన్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. మిగిలిన పప్పుతో పోలిస్తే ఇది మూడింతలు అధికం. కుక్కర్ అవసరం లేకుండా త్వరగా ఉడుకుతుంది. ఉడికే సమయంలో కమ్మటి వాసన వస్తుంది. తాండూరు కందిపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పలు పరిశోధనలు చేశారు. భౌగోళిక గుర్తింపు రావడంతో ఇక్కడ కందికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత ప్రాచుర్యం లభించింది. దేశంలో మరిన్ని బ్రాండ్లకు భౌగోళిక గుర్తింపు ఉంది. వాటిలో బాస్మతి రైస్, డార్జిలింగ్ టీ, చందేరి ఫ్యాబ్రిక్స్, మైసూర్ సిల్క్, కాంగ్రా టీ ఇలా చాలా వాటికి జీఐ ట్యాగ్ ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి బనగానపల్లి మామిడి, బొబ్బిలి వీణ, ధర్మవరం చేనేత పట్టు చీరలు, నిమ్మలకుంట తోలు బొమ్మలు, ఉప్పాడ జామ్దానీ చీరలు, తెలంగాణలో పోచంపల్లి చీరలు, కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ, హైదరాబాద్ లాడ్ బజార్ వంటివి ఈ జాబితాలో ఉన్నాయి.

ఆరోగ్యం.. బలం

శాస్త్రవేత్తల పరిశోధనల ప్రకారం వంద గ్రాముల తాండూరు కంది పప్పులో పోషకాలు ఈ విధంగా ఉంటాయి. ఎనర్జీ 335 క్యాలరీలు, ప్రొటీన్లు 22.3 గ్రాములు, ఫ్యాట్ 1.7 గ్రాములు, సీఏ 7.3 ఎమ్‌జీ, థయామిన్ 0.45 గ్రాములు, రైబోఫ్లెవిన్ 0.19 గ్రాములు, నియాసిన్ 2.9 గ్రాములు, విటమిన్ ఏ 132 ఎమ్‌సీజీ ఉంటుంది. ఈ పప్పు తింటే ఆరోగ్యానికి ఆరోగ్యం.. బలానికి బలం వస్తుంది.

నల్లరేగడి భూముల్లో అధిక దిగుబడి

తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో నల్లరేగడి భూములు ఎక్కువగా ఉన్నాయి. ఈ భూముల్లో కంది పంట సాగు చేస్తే ఎక్కువ దిగుబడి వస్తుంది. కొడంగల్ నియోజకవర్గంలో కంది, జొన్న పంటలు సాగు చేయడం అనాదిగా వస్తోంది. పంట మార్పిడి విధానంలో ఒక సంవత్సరం కంది వేస్తే మరో సంవత్సరం జొన్న వేసే వారు. కంది పంట రైతులను ఆర్థికంగా ఆదుకుంటోంది. దశాబ్దకాలంగా కంది సాగు విస్తీర్ణం పెరిగింది.

కంది బోర్డు ఏర్పాటులో జాప్యం

జిల్లాలో కంది బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలా కాలంగా వినిపిస్తోంది. అయితే కార్యరూపం దాల్చలేదు. జిల్లాలో కంది రైతులకు మేలు జరగాలంటే కంది బోర్డు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంది. రైతులు దళారుల బారిన పడి ధర, తూకంలో మోస పోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పంట వేసిన దగ్గర నుంచి కోతకు వచ్చే వరకు రైతులకు అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన అవసరం ఉంది. వర్షంపై ఆధారపడి ఇక్కడి రైతులు వ్యవసాయం చేస్తున్నారు. సాగునీటి వనరులు లేని ఈ ప్రాంతంలో సాగునీటి కోసం ప్రభుత్వం నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకానికి రూప కల్పన చేసింది. ఈ ఎత్తిపోతల ద్వారా కొడంగల్ నియోజకవర్గంలోని భూములకు సాగునీరు అందే అవకాశం ఉందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కంది సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం కూడా ఉంది.

ఎకరానికి ఎర్ర నేలలో 3 క్వింటాళ్లు, నల్లరేగడి భూముల్లో 4 నుంచి 5 క్వింటాళ్ల వరకు కందుల దిగుబడి వస్తుంది. పండిన పంటలో 80 శాతం పప్పు లభిస్తుంది. తాండూరు వ్యవసాయ

సాగు దిగుబడి

మార్కెట్‌లో కందులు, కంది పప్పుకు రికార్డు స్థాయిలో ధరలు ఉన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా క్వింటాలుకు రూ.10 వేలకు పైగా ధర ఉంది. కంది పప్పు ధర క్వింటాల్‌కు రూ. 15వేలు పలుకుతోంది. ఈ ఏడాది తాండూరు మార్కెట్‌లో 60వేల క్వింటాళ్ల కందులు క్రయ విక్రయాలు జరిగినట్లు తెలిసింది.

రంజిత్‌ను గెలిపించుకుందాం

- చేవెళ్ల ఎంపీ సీటును సీఎంకు కానుకగా ఇద్దాం
- అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్
- లక్షకు పైగా మెజార్టీ ఇవ్వాలి: సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం వికారాబాద్‌లోని గౌలికార్ నర్సింగ్‌రావు ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి తామిద్దరం కృషి చేస్తామని తెలిపారు. చేవెళ్ల లోక్‌సభ స్థానాన్ని గెలిపించి సీఎంకు కానుక ఇద్దామన్నారు.

పిలిస్తే పలికే నేత రంజిత్: వేం నరేందర్‌రెడ్డి

ఎంపీ రంజిత్‌రెడ్డి పిలిస్తే పలికే నేత అని సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లాలో పార్టీ బలంగా ఉందని, చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల్లో లక్ష మెజార్టీ తేవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలను అమలు చేసిందన్నారు. ఆగస్టు 15వ తేదీ రైతు రుణమాఫీ చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. మల్కాజిగిరిలో బలమైన నేత ఉండాలనే సీఎం పట్నం సునీతా రెడ్డిని బరిలో నిలిపారని తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటా: రంజిత్‌రెడ్డి

ప్రతి కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. బీజేపీ పేదలకు చేసిందేమి లేదన్నారు. నన్ను గెలిపిస్తే సేవకుడిలా పని చేస్తానన్నారు.

బీజేపీకి గుణపాఠం చెప్పాలి: రామ్మోహన్‌రెడ్డి

దేశం కోసం ప్రాణాలు అర్పించింది కాంగ్రెస్ పార్టీయే అని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. దొడ్డిదారిన ప్రభుత్వాలు కూలుస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రానున్న రోజుల్లో రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు సైతం కాంగ్రెస్‌లో చేరుతారని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని ఆరోపించారు. సమావేశంలో వికారాబాద్ ఎన్నికల కోఆర్డినేటర్ యాదవరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సంతోష, స్పీకర్ తనయ అనన్య చేతన్, మాజీ జెడ్పీటీసీలు మైపాల్‌రెడ్డి, షరీఫ్, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్ నాయక్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

బీఆర్ఎస్ రాష్ట్రాన్ని లూటీ చేసింది

- కాంగ్రెస్.. అధిష్టానికి దోచిపెడుతోంది
- బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ధారూరు: ఆరు గ్యారంటీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ప్రజల జీవితాల్లో మార్పు రావాలంటే దేశంలో బీజేపీ ప్రభుత్వం రావాలన్నారు. ధారూరులోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన బీజేపీ ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేయలేదని ఆరోపించారు. అర్హులైన పేదలకు రూ.20 వేల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు ఇప్పించే పూచీ తనదని హామీ ఇచ్చారు. ప్రధాని మోదీ ప్రపంచ దేశాలకు దీటుగా భారత్‌ను ముందుకు నడిపారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచి చిప్ప చేతికి ఇచ్చిందని ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ఉన్నది దోచి అధిష్టానిని దోచిపెడుతోందని ఆరోపించారు. సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. దేశం మొత్తం మోదీ వైపు చూస్తోందని, హ్యాట్రిక్ పీఎం కావడం ఖాయమన్నారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే కేంద్ర నుంచి భారీగా నిధులు తెచ్చి చేవెళ్ల ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. తాను మూడు లక్షల మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తి చేశారు. అనంతరం బీఆర్ఎస్‌కు చెందిన మాజీ సర్పంచులు, వార్డు మాజీ సభ్యులు, నాయకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మండల అధ్యక్షుడు రమేశ్, నాయకులు రాజు నాయక్, వడ్ల నందు, పాండు గౌడ్, విశ్వనాథం, రాజేందర్‌గౌడ్, రవీందర్‌గౌడ్, ఉమాపార్వతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అమ్మలకు అందని కిట్లు

- మూడు నెలలుగా నిలిచిన ఎంసీహెచ్ పథకం
- రక్తహీనత సమస్య ఎదుర్కొంటున్న గర్భిణులు, బాలింతలు

తాండూరు: మాతాశిశు మరణాల సంఖ్యను తగ్గించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు కేసీఆర్ కిట్, న్యూట్రిషియన్ కిట్లు అందజేసింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలు కావడంతో పథకం అమలుకు నోచుకోవడం లేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కేసీఆర్ కిట్‌ను ఎంసీహెచ్‌గా మార్చిన విషయం తెలిసిందే.. కానీ గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందడం లేదు. గత ప్రభుత్వం అమ్మ ఒడి పథకం కింద గర్భిణులకు రూ.12 వేల చొప్పున అందించింది. ఇది కూడా అమలు కావడం లేదు.

ప్రతి నెలా 800 ప్రసవాలు

జిల్లాలో 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నాలుగు ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీలతో పాటు తాండూరులో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఉంది. జిల్లాలో ప్రతి నెలా సుమారు 800 ప్రసవాలు జరుగుతాయి. గత ప్రభుత్వం కేసీఆర్ కిట్ పేరిట తల్లిబిడ్డకు ఉపయోగపడే సబ్బులు, దోమతెర, బేబీ ఆయిల్, బెడ్, డ్రెస్సులు, చీరలు, హ్యాండ్ బ్యాగ్, టవల్, న్యాప్‌కిన్లు, డైపర్లు, షాంపులు, శిశువుల కోసం బొమ్మలు ఇచ్చేది. గర్భిణుల్లో రక్తహీనత తగ్గించేందుకు కేసీఆర్ న్యూట్రిషిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఇందులో ఒక కిలో న్యూట్రిషన్ మిక్స్ పౌడర్, కిలో ఖర్జూరం, మూడు బాటిళ్ల ఐరన్ సిరప్, 500 గ్రాముల నెయ్యి, ఒక కప్పును అందించే వారు. ప్రస్తుతం ఇవి అందడం లేదు. దీంతో గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు.



తాండూరులోని మాతాశిశు ఆస్పత్రి

ఎన్నికల కోడ్‌తో జాప్యం



గర్భిణులు, బాలింతల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంసీహెచ్ పేరిట కిట్లు అందజేయనుంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కిట్ల పంపిణీలో జాప్యం జరుగుతోంది. త్వరలో పథకాన్ని అమలు చేస్తాం. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కిట్లు అందజేస్తాం.

– డాక్టర్ పల్వన్‌కుమార్, డీఎంఅండ్‌హెచ్‌ఓ

ఎన్నికల ఖర్చు పక్కాగా ఉండాలి

వ్యయ పరిశీలకుడు రాజీవ్ చావ్రా

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల ఖర్చులను పక్కాగా లెక్కించాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాజీవ్ చావ్రా సూచించారు. శనివారం వికారాబాద్‌కు వచ్చిన ఆయనకు కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, జిల్లా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఏంసీసీ, ఎస్‌జీఆర్ఎస్, కంట్రోల్ రూమ్, సీ విజిల్, ఎంసీఎంపీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అభ్యర్థులు చేసే ఖర్చులను ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాల మేరకు జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనుమానాస్పద ఖాతాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం సీ విజిల్ యాప్, టోల్ ఫ్రీ నంబర్ 1950, గ్రీవెన్స్ కమిటీ సెంటర్, మీడియా పాయింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు. దినపత్రికల్లో వచ్చే పెయిడ్ న్యూస్‌పై దృష్టి సారించాలన్నారు. అనంతరం ఎన్నికల ఏర్పాట్లు, ఓటరు జాబితా తదితర వాటిపై కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యా నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీఓలు వాసుచంద్ర, శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ సుధీర్, డీఆర్‌డీఏ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాజీవ్ చావ్రా

ప్రశాంత ఎన్నికలకు ఏర్పాట్లు

అనంతగిరి: జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ రూట్స్, సమస్యాత్మక కేంద్రాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా జిల్లాలో ఎలాంటి అలజడులు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీలను మరింత పటిష్టం చేయాలని సిబ్బందికి సూచించారు. మద్యం, డబ్బు, వస్తువుల పంపిణీపై నిఘా పెట్టాలన్నారు. ఎన్నికల్లో ఇబ్బందులు సృష్టించే వారిని బైండోవర్ చేయాలని సూచించారు. జిల్లాకు వచ్చే కేంద్ర బలగాలను సమన్వయం చేసుకుంటూ పని చేయాలన్నారు. అనంతరం స్టేషన్ల వారీగా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, కరుణసాగర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

క్లుప్తంగా

పిల్లలు పుట్టడంలేదని మహిళ బలవన్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళీధర్

కుల్కచర్ల: పిల్లలు పుట్టడంలేదనే ఆవేదనతో మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండల పరిధిలోని కుస్మసముద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన షబ్బీర్ తన కూతురు సమీనా బేగం(35)కు ఆరేళ్ల క్రితం వట్టిపల్లి ఫలక్‌నామాకు చెందిన జాఫర్ షరీఫ్‌తో వివాహం జరిపించారు. వారికి సంతానం కలుగలేదు. రంజాన్‌కు పుట్టింటికి వచ్చిన ఆమె ఈ నెల 17న సాయంత్రం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబీకులు వెంటనే మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్ మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పంచనామా చేశారు. మృతురాలి తండ్రి షబ్బీర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అన్వేశ్ రెడ్డి తెలిపారు.

మొబైల్ ఫోన్లు రికవరీ



బాధితులకు ఫోన్లు అప్పగిస్తున్న ఎస్ఐ అన్వేష్ రెడ్డి

కుల్కచర్ల: చోరీకి గురైన మొబైల్ ఫోన్లు వినియోగదారులకు అందించిన ఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రంలో నివసిస్తున్న బోయిని శ్రీనివాస్, బోయిని వెంకట్‌లకు చెందిన ఫోన్లు వేర్వేరు ప్రాంతాల్లో చోరీకి గురయ్యాయి. కాగ సీఈఐఆర్ విధానంతో వారు పోగొట్టుకున్న ఫోన్లు తిరిగి పట్టుకుని శనివారం బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ.. ఫోన్లు పోగొట్టుకున్నారు ఫిర్యాదు చేస్తే రికవరీ చేస్తామన్నారు.

నగదు పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ శ్రీశైలం యాదవ్

దౌల్తాబాద్: మండల పరిధిలోని చంద్రకల్ చెక్ పోస్టు వద్ద శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కర్ణాటక నుంచి వస్తున్న కారులో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.98వేల నగదు గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీశైలంయాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో రూ.50వేల కంటే ఎక్కువ నగదు రషీదులు లేకుండా తరలిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

బీఎల్ఏల ట్రైనర్‌గా గౌరీ సతీష్

మొయినాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఎల్ఏలకు శిక్షణ ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ట్రైనర్లను నియమించింది. అందులో భాగంగా మొయినాబాద్ మండలానికి చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్‌ను సికింద్రాబాద్, మెదక్, నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల బూత్ లెవెల్ ఏజెంట్(బీఎల్ఏ)లకు శిక్షణ ఇచ్చేందుకు ట్రైనర్‌గా నియమిస్తూ టీపీసీసీ వార్ రూం చైర్మన్ ప్రవీణ్ మల్లాడి ఉత్తర్వులు జారీ చేశారు.

గాలి వాన బీభత్సం

విరిగిన విద్యుత్ స్తంభాలు
- నేలకొరిగిన వృక్షాలు
- కరెంట్ సరఫరా నిలిచి చీకట్లో మగ్గిన తండాలు

ధారూరు: ఈదురు గాలులతో కూడిన వర్షంతో చెట్లు నేలకొరగాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. శనివారం మధ్యాహ్నం మండల పరిధిలోని పీసీఎం తండా, శేరిగడ్డ తండా, జీడిగడ్డ తండాల్లో ఒక్కసారిగా బలమైన ఈదురు గాలులు వీచి వర్షం కురిసింది. పొలాలు, ఇళ్ల వద్ద చెట్లు నేలకొరిగాయి. మినీ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడడంతో విద్యుత్‌వైర్లు తెగిపడ్డాయి. పీసీఎం తండాలోని మిషన్ భగీరథ ట్యాంక్ వద్ద చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో స్తంభం కూలింది. పీసీఎంతండాలో ఇంటి పక్కనే నిలిపిన ట్రాక్టర్‌పై చెట్లు విరిగిపడటతో దెబ్బతింది.

కరెంట్ కష్టాలు

అంపల్లి, గురుదొట్ల, పీసీఎం తండా, శేరిగడ్డంతండా, జీడిగడ్డతండాల్లో విద్యుత్ తీగలపై పడిన చెట్ల కొమ్మలను నరికేందుకు శనివారం ఉదయమే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. మధ్యాహ్నం సరఫరాను పునరుద్ధరించాలని ప్రయత్నిస్తున్న సమయంలోనే ఈదురుగాలులతో కూడిన వర్షం కురియడంతో విద్యుత్ స్థంభాలు విరిగి సరఫరాకు వీలుకాలేదు. మరమ్మతులు వీలుకాక రాత్రంతా చీకట్లోనే మగ్గారు. ఈదురుగాలులకు మామిడి కాయలు నేలరాలాలయని రైతులు ఆందోళన వెల్లిబుచ్చారు.



ధారూరు: జీడిగడ్డతండాలో పాడైన మినీ ట్రాన్స్‌ఫార్మర్లు

పెద్దేముల్ మండల కేంద్రంలో..

పెద్దేముల్: మండల కేంద్రంలో గాలి వాన బీభత్సం సృష్టించింది. శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి మండల కేంద్రలోని ఎస్‌సీ కాలనీలో, మైనార్టీ శ్మశాన వాటిక, పలు చోట్ల చెట్లు విరిగి విద్యుత్ స్తంభాలపై పడ్డాయి. దీంతో మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మామిడి కాయలు నేలరాలాయి.



పెద్దేముల్: ఈదురు గాలులకు విరిగిన వృక్షం



ధారూరు: శేరిగడ్డతండాలో ట్రాక్టర్‌పై విరిగిపడిన చెట్లు



ధారూరు: పెలిచింతమడుగు తండాలో తెగిన విద్యుత్‌వైర్లు

కారు, బైక్ ఢీ..

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



ఉపేందర్ (ఫైల్)

చేవెళ్ల: కారు బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో చికిత్స పొందుతున్న యువకుడు శనివారం మృతి చెందాడు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవుని ఎర్రవల్లి బస్ స్టేజీ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన ప్రకారం.. ముడిమ్యాల గ్రామానికి చెందిన పి.నారాయణ కుమారుడు ఉపేందర్(21) గ్రామంలోని టెంట్‌హౌస్‌లో పనిచేస్తున్నాడు. బైక్‌లో పెట్రోల్ పోయిచేందుకు ఉపేందర్ మరో యువకుడు ఉదయ్‌కిరణ్ దేవునిఎర్రవల్లి వద్ద ఉన్న పెట్రోల్ పంప్‌కు వచ్చారు. వారు తిరిగి వెళ్తుండగా చేవెళ్ల నుంచి వేగంగా ప్రయాణిస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ ఉన్న ఉపేందర్ ద్విచక్రవాహనంపై నుంచి ఎగిరి పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఉదయ్‌కిరణ్‌కు స్వల్పగాయాలయ్యాయి. వారిని వెంటనే చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఉపేందర్ పరిస్థితి విషమంగా ఉందని నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఉపేందర్ బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు మండలంలోని జాలగూడ గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



పుడుగుర్తిలో కాంగ్రెస్ నేతల ప్రచారం

డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం

పూడూరు: కాంగ్రెస్ అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని డీసీసీ ఉపాధ్యక్షుడు కడ్మూరు ఆనందం అన్నారు. శనివారం మండల పరిధిలోని పుడుగుర్తిలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పదేళ్లు పాలించినా పేదలకు చేసిందేమీ లేదని విమర్శించారు. మాయమాటలు, అంకెల గారడీతో పేదల సంక్షేమాన్ని గాలికొదిలేశారన్నారు. సాధ్యం కానీ హామీలతో ప్రజలను ఇబ్బంది పెట్టారన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగాలు, ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘణత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. చేవెళ్ల లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పెంటయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు భాస్కర్, మోహిన్‌పాషా, సురేశ్ పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా

- నియోజకవర్గానికి కొండా చేసిందేమీ లేదు
- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

మహేశ్వరం: ప్రజలకు అందుబాటులో ఉండని బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని చిత్తుగా ఓడించాలని చేవెళ్ల ఎంపీ, కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉండరని.. ఆయన్ను ఎవరూ గుర్తుపట్టరని అటువంటి అభ్యర్థికి ఓటేసినా ప్రయోజనం శూన్యం అన్నారు. గతంలో ఆయన ఎంపీగా పని చేసినా నియోజకవర్గానికి నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారన్నారు. మత విద్వేశాలు రెచ్చగొట్టి యువతను ఓటు బ్యాంకుగా మలుచుకునేందుకు బీజేపీ అడ్డదారులు తొక్కుతోందని ఆరోపించారు. అధికారంలో ఉన్న పదేళ్లు పేదలను ఇబ్బందులు పెట్టారన్నారు. యువత, ఓటర్లు బీజేపీ వలలో పడొద్దని సూచించారు. తాను చేవెళ్ల ఎంపీగా నియోజకవర్గానికి రోడ్లు, భవనాలు తీసుకువచ్చానని గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అండగా ఉంటానని మాటిచ్చారు. దేశంలో ఇండియా కూటమి అధికారంలోని వస్తుందని రాహుల్ గాంధీ ప్రధాని అవుతారన్నారు. ప్రతీ ఒక్కరు ప్రజలకు కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలతో పాటుగా పాంచ్ న్యాయ్‌ను వివరించాలన్నారు. తనను ఎంపీగా గెలపిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో చేపట్టాల్సిన వ్యూహాలను నేతలకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాతారెడ్డి, నియోజకవర్గ ఎంపీ ఎన్నికల పరిశీలకులు నేరేళ్ల శారద, నిజాముద్దీన్, మహేశ్వరం ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్, మాజీ ఎంపీపీ కొరుపోలు రఘుమారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్, వత్తుల రఘుపతి, కూన యాదయ్య, ఆవుల యాదయ్య, నర్సింహ, అంధ్యానాయక్ పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

పుష్కరిణిలో వ్యక్తి గల్లంతు



లక్ష్మీవేంకటేశ్వరస్వామి పుష్కరిణిలో గాలింపు చేపట్టిన గజ ఈతగాళ్లు



రవి(ఫైల్)

- రోజంతా వెతికినా దొరకని ఆచూకీ
- బాధితుడు ఏపీలోని ప్రకాశం జిల్లా వాసి

చేవెళ్ల: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి పుష్కరిణిలో స్నానానికి వెళ్లిన ఓ తాపీ మేస్త్రీ నీట మునిగి గల్లంతయ్యాడు. ఈ ఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. శనివారం గజ ఈతగాళ్లు రోజంతా వెతికినా మృతదేహం లభించలేదు. వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా సొంతరావు గ్రామానికి చెందిన తానే రవి(38) ఇరవై ఏళ్ల క్రితం రాజేంద్రనగర్ మండలం బంగ్లగూడ ప్రాంతంలోని కాళీ మందిర్ వద్ద నివాసం ఉంటూ.. తాపీ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల షాబాద్ మండలంలోని ఏట్లఎర్రవల్లి గ్రామంలో ఓ ఇల్లు కట్టేందుకు పనిని గుత్తకు తీసుకున్నాడు. శుక్రవారం పనికి వచ్చిన ఆయన సాయంత్రం చేవెళ్లకు చేరుకున్నాడు. ఆయనతో పాటు మరో ఇద్దరు తెలిసిన వ్యక్తులు ఉండటంతో ముగ్గురు కలిసి చేవెళ్లలోని వేంకటేశ్వర స్వామి వారి పుష్కరిణి(గుండం)లోకి స్నానానికి వెళ్లారు. మద్యం సేవించిన వారు ఇద్దరు ఒడ్డున స్నానం చేస్తుండగా రవి గుండం మధ్యకు ఈదుకుంటూ వెళ్లి ఆయాసం రావడంతో నీట మునిగాడు. ఒడ్డున ఇద్దరు వ్యక్తులు అతన్ని కాపాడేందుకు విఫలయత్నం చేశారు. వారు వెంటనే చేవెళ్ల పోలీసులకు సమాచారం అందించారు. నీటిలో మునిగిపోవటంతో పోలీసులకు జాడ కనిపించలేదు. ఈత వచ్చిన వారితో గాలించినా ఫలితం లభించలేదు. శనివారం ఉదయం గుండంలో మళ్లీ గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ దొరక్క సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐ వీరబ్రహ్మం గజ ఈతగాళ్లను పిలిపించి వెతికించారు. గుండలంలో నీరు ఎక్కువగా ఉండటంతో పాటు పెద్దగా ఉండటంతో మృతదేహం ఎక్కడ ఉందనేది తెలియడం లేదన్నారు.

నేడు రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ క్రీడా పోటీలు

లక్డీకాపూల్: రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7 గంటల నుండి ఎల్‌బీ నగర్, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో అథ్లెటిక్స్ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి ఇ.గోపి తెలిపారు. 12 సంవత్సరాలు పైబడిన వారికి అండర్ 14, 16, 18, 20, మెన్ అండ్ ఉమెన్ విభాగాలలో 100మీ, 600మీ, 800మీ, 1500మీ, 2000మీ, 5000మీ పరుగు పోటీలను నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ పోటీల విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్టు చెప్పారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వివరాలకు రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ కోచ్ తిప్పన సాయిరెడ్డిని 9703838987 నెంబర్‌లో సంప్రదించాల్సిందిగా కోరారు.

వాటర్ ప్లాంట్ సీజ్

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని ప్రాంతంలో అక్రమంగా నీటి సరఫరా చేస్తున్న వాటర్ ప్లాంట్‌ను తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది సీజ్ చేశారు. అక్రమంగా నీటి సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ తహసీల్దార్ బొమ్మ రాములు హెచ్చరించారు.

శ్రీవారికి వాహన సేవలు

- గోప, హనుమంత వాహనాలపై ఊరేగిన చిలుకూరు బాలాజీ



గోప వాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవారు గోప, హనుమంత వాహన సేవలు అందుకున్నారు. శనివారం రాత్రి స్వామివారిని మొదటగా గోపవాహనంపై ఆసీనులను చేసి ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం హనుమంత వాహనంపై ఊరేగింపును అంగరంగ వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా వేదపారాయణం, పూజలు, మంగళహారతి సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాల కృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, నర్సింహాచార్యులు, కిట్టు, కృష్ణమూర్తి, కన్నయ్య, సురేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారిని సూర్యప్రభ వాహనం, గరుడ వాహనంపై ఊరేగించి సేవలు అందించనున్నారు. ఆదివారం రాత్రి 11 గంటలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తారు.

'వివాహ ప్రాప్తి' రద్దు

చిలుకూరు బాలాజీ దేవాలయంలో ఆదివారం తలపెట్టిన 'వివాహ ప్రాప్తి' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఆలయ అర్చకుడు రంగరాజన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ వీడియో విడుదల చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజారోహణం సందర్భంగా సంతానం లేని మహిళలకు 'సంతాన ప్రాప్తి' కోసం గరుడ ప్రసాదం పంపిణీ, ఆదివారం స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా వివాహం ఆలస్యమయ్యే వారికోసం 'వివాహ ప్రాప్తి' చేపట్టాలని ముందుగా నిర్ణయించామన్నారు. శుక్రవారం జరిగిన గరుడ ప్రసాదం పంపిణీకి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఇబ్బందులు జరిగాయని ఆదివారం రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం సందర్భంగా నిర్వహించే 'వివాహ ప్రాప్తి'కి కూడా భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం యథావిధిగా జరుగుతుందని.. భక్తులు ఇంటి దగ్గరి నుంచే వివాహ ప్రాప్తికోసం స్వామివారికి మొక్కుకోవాలన్నారు. కల్యాణోత్సవానికి ఎవరూ రావద్దని సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న సైబర్ క్రైం డీసీపీ నర్సింహా

సైబర్ క్రైం డీసీపీ నర్సింహా

నందిగామ: సైబర్ నేరాలపట్ల అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీసీపీ నర్సింహా సూచించారు. శనివారం మండల పేరిధిలోని కన్హా శాంతివనంలో కన్హా హార్ట్‌ఫుల్‌నెస్ లెర్నింగ్ సెంటర్‌లో ఎస్‌సీ(సైబర్ క్రైం ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ) దిల్‌సే (యువతకు భద్రత కల్పించేందుకు డిజిటల్ అక్షరాస్యత) బృందం సహకారంతో విద్యార్థుకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సైబర్ క్రైం డీసీపీ నర్సింహా సైబర్ నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థులు మొబైల్ ఫోన్స్‌కు బానిసలవ్వడం, గేమింగ్, బెట్టింగ్ యాప్‌లకు, సోషల్‌మీడియాలకు ఆకర్శితులై నష్టపోయే తీరును అవగాహన కల్పి ంచారు. మోసాలకు గురైన వారు సైబర్‌క్రైం రిపోర్టింగ్ 1930 ని ఏ విధంగా ఉపయోగించువాలో చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు రవీందర్ రెడ్డి, చంద్రకాంత్, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, అజయ్ కుమార్, భానుమూర్తి, సైబర్ సెక్యూరిటీ అధికారులు, వలంటీర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంతీయ పార్టీలతోనే అభివృద్ధి

- ప్రజాభిప్రాయం పట్టని కాంగ్రెస్, బీజేపీ
- కాంగ్రెస్ ప్రభుత్వంపై భ్రమలు తొలిగాయి
- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, చిత్రంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

ఆమనగల్లు: ప్రాంతీయ పార్టీలతోనే రాష్ట్రాల్లో అభివృద్ధి సాధ్యమని బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ లక్ష్మి గార్డెన్స్‌లో శనివారం కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ లోక్‌సభ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి ఎన్నికల ఇన్‌చార్జి చాడ కిషన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు రంగినేని అభిలాష్‌రావ్, గిరిజన కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాల్యా నాయక్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం హాజరయ్యారు. సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రాభవం కోల్పోతోందని, ప్రధాని మోదీ ఆకర్షణ తగ్గిందన్నారు. కొన్ని మీడియా సంస్థలు బీఆర్‌ఎస్‌పై విష ప్రచారం సాగిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. బీఆర్‌ఎస్ శ్రేణులు సోషల్ మీడియా ద్వారా పార్టీ కార్యక్రమాలు, పదేళ్ల కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల భ్రమలు తొలగిపోయాయని, ఎందుకు ఓటు వేశామా అని పశ్చాత్తప పడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మెజార్టీ స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఉన్నత విద్యావంతుడు ప్రవీణ్‌కుమార్‌ను గెలిపిస్తే లోక్‌సభలో అణగారిన వర్గాల ప్రజల గొంతుకగా నిలుస్తాడని అన్నారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రాణం ఉన్నంతవరకు బీఆర్‌ఎస్‌లోనే ఉంటానని, తనపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎంపీగా గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేస్తానని, అవగాహన లేని వ్యక్తులు, స్థానికేతరులను నమ్మి ప్రజలు మోసపోవద్దని అన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, జెడ్పీటీసీలు అనురాధ, దశరథ్‌నాయక్, విజితారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.